మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

బిజెపికి పెరుగుతున్న ఆదరణ..

అసెంబ్లీ ఎన్నికల్లో పెరిగిన ఓటింగ్ శాతం.. బిజెపి రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్

మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 10 ప్రభాతవార్త : బిజెపికి ఆదరణ పెరుగుతుందని, రాష్ట్రంలోనూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగిందని బిజెపి రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ అన్నారు. కోస్గి మండలంలోని చెన్నారం గ్రామంలో ఏర్పాటు చేసిన వీక్షిత్ భారత్ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో పాయింట్‌లో ఫొటోదిగి వికసిత్ భారత్ బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ నరేంద్రమోదీ సంక్షేమ పథకాల గురించి వివరించి వారు ఏ పథకం ద్వారా ఎక్కువ లబ్ది పొందుతున్నారో వాళ్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే వికసిత్ భారత్ క్యాలెండర్, బుకలెట్‌ను విడుదల చేసి గ్రామస్తులకు పంచారు. కోస్గి మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు దేవప్పతో సహా పలువురు నాయకులు శాంతికుమార్ సమక్షంలో బిజెపిలో చేరారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్, కొడంగల్ అసెంబ్లీ కో కన్వీనర్ కోతకొండ రాము, నారాయణరెడ్డి, భాస్కర్, శ్రీకాంత్, ఎర్రం మల్లేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న శాంతికుమార్

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శాంతికుమార్

ఎన్నికలకు సిబ్బంది, టీంలు సంసిద్ధంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట ప్రతినిధి,జనవరి 10 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం సెక్టోరియల్ ఆఫీసర్లు, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి, వివిటి అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ టీం అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పలు సూచనలు చేశారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అన్ని టీములు ఎన్నికలపై అవగాహన కలిగి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మయాంక్ మిత్తల్, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టెలికాం అడ్వైజర్ సభ్యురాలిగా సాహితీరెడ్డి

- శుభాకాంక్షలు తెలిపిన బిజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

- మహబూబ్‌నగర్ జిల్లాకు ఐదుమంది సభ్యులుగా నియామకం

మహబూబ్‌నగర్‌బ్యూరో, జనవరి10, ప్రభాతవార్త: బీఎస్ఎన్ఎల్ టెలికాం అడ్వైజర్ సభ్యురాలిగా పాలమూరు జిల్లా నుంచి సాహితీ రెడ్డి నియమితులయ్యారు. జడ్చర్లకు చెందిన సాహితీరెడ్డి బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అయితే బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యురాలిగా నియమితులైన సందర్భంగా సాహితీరెడ్డిని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ బుధవారం సన్మానించారు. శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి సాహితీరెడ్డితోపాటు కే నారాయణరెడ్డి, ఎస్, కృష్ణవర్ధన్‌రెడ్డి, కే నిరంజనమ్మ, జి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు.

సాహితీరెడ్డిని సన్మానిస్తున్న డీకే అరుణ

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసిన స్త్రీ నిధి ఉద్యోగులు..

నాగర్‌కర్నూల్ ప్రతినిధి,జనవరి10 ప్రభాతవార్త: సెర్ప్ మరియు మెప్మా సిబ్బందికి అమలు పరుస్తున్న విధంగా స్త్రీ నిధి సిబ్బందికి కూడా పే స్కేల్ వర్తింప చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను స్త్రీనిధి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బుధవారం సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. మహిళ సంఘ సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం స్త్రీనిధి సంస్థను ఏర్పాటు చేసిందని, సెర్ప్ మరియు మెప్మా సమన్వయంతో లక్ష్యం నెరవేరే దిశగా స్త్రీనిధి సంస్థ ఉద్యోగులు నిరంతరం కష్ట పడుతున్నారని వారికి సెర్ప్ మరియు మెప్మా సిబ్బందికి అమలు పరుస్తున్న విధంగా పేస్కేల్ వర్తింప చేయాలని, స్త్రీనిధి సంస్థను ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో విలీనం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందిస్తూ అంశాల అమలుకు సంబంధిత శాఖ మంత్రితో కలిసి నిర్ణయం తీసుకుంటామన్నారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు సమస్యను వివరిస్తున్న స్త్రీ నిధి ఉద్యోగులు

మత సామరస్యానికి ప్రతీక అబ్దుల్ ఖాదర్ దర్గా..

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి.. గంధోత్సవంలో పాల్గొన్న సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 10 ప్రభాతవార్త : మత సామరస్యానిక ప్రతీక అబ్దుల్ ఖాదర్ దర్గా అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అబ్దుల్ ఖాదర్ సాహెబ్ దర్గా ఉర్సు ఉత్సవాలకు బుధవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులు చల్లావంశీ చంద్ రెడ్డితో కలిసి గంధోత్సవంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకు ముందు దర్గా సాంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. అబ్దుల్‌ఖాదర్ సాహెబ్‌దర్గా పెద్ద జమీర్ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అబ్దుల్ ఖాదర్ దర్గాకు 85 ఏళ్ల చరిత్ర ఉందని భక్తులకు కొంగు బంగారంగా కోరిన కోరికలు తీరుతాయని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగానే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రంలోని భక్తులు కూడా ఈ దర్గాను దర్శించి భక్తితో తరిస్తున్నారని ఆయన అన్నారు. అంత విశిష్టత కలిగిన అబ్దుల్ ఖాదర్ దర్గా మన మహబూబ్‌నగర్ పట్టణంలో ఉండడం నిజంగా మన అదృష్టం అన్నారు. మత సమరస్యానికి ప్రతీకగా పేరు గాంచిన గొప్ప ఆధ్యాత్మిక సంపద ఈ అబ్దుల్ ఖాదర్ దర్గా అని చెప్పారు. ఎందరో ప్రముఖులు నిత్యం ఇక్కడకు వచ్చి మొక్కులు చెల్లిస్తారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రకుమార్‌గౌడ్, సిజె బెనహర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, మాజీ జిల్లా మహిళా అధ్యక్షురాలు బెక్కరి అనిత, రాష్ట్ర ఎస్టీ సెల్ ఛైర్మన్ లింగంనాయక్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సునిల్‌కుమార్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, తకి, మల్లు నర్సింహరెడ్డి, పట్టణ కార్యనిర్వహక అధ్యక్షులు అబ్జుత్ అలీ, తులసిరాంనాయక్,తాహెర్, సేవాదళ్ సభ్యులు ఐబు బాకర్, నరెందర్‌గౌడ్, రాజు, రాంరెడ్డి, ఎన్ఎస్‌యుఐ దీపక్, అవేజ్, నవనీత పాల్గొన్నారు.

దర్గాలో చాదర్ సమర్పిస్తున్న ఎమ్మెల్యేలు

కార్యకర్తలతో మాట ముచ్చట..

వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

కుచ్చర్కల్ గ్రామంలో కార్యకర్తలతో సమావేశం

మహబూబ్‌నగర్‌బ్యూరో,జనవరి10 ప్రభాతవార్త : ప్రతి గ్రామంలోని సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో పర్యటించి కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. రాజాపూర్ మండలంలోని కుచ్చర్కల్ గ్రామంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కార్యకర్తలో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యకర్తలతో మమేకమై వారితో గ్రామ సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే సమస్యలను తెలుసుకోవడం కోసం కార్యకర్తలతో ముఖాముచు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రధానంగా ఏసమస్య ఉందో తెలుసుకుని దానిని పరిష్కరించేలా కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. చిట్ చాట్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నాటడం.. నరకడం..!!

- వృథా శ్రమ..వృథా ఖర్చు..
- సామాన్య ప్రజలపై తప్పని భారం..
- విస్తరణల పేరిటి ఏపుగా పెరిగిన చెట్లను నరికివేస్తున్న వైనం..

నరికి వేయబడిన చెట్ల దూలాలు,మానులను లారీలు,ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం

భూత్పూర్,జనవరి 10,ప్రభాతవార్త : ఖచెట్లుంటే క్షేమం,లేకుంటే క్షామం..వృక్షో రక్షితి, రక్షితహ..పచ్చని చెట్లు,ప్రగతికి మెట్లు..గ అన్న అటవీశాఖ నినాదాలు కేవలం మాటలకే పరిమితమవుతున్నాయి.. సామాజిక వనాలు,హరితహారాలు వృథా అవుతున్నాయి.. హరితహారం పేరిట ఏటా ప్రభుత్వం కొన్ని కోట్ల చెట్లను పెంచుతోంది.ఒక్కో నియోజకవర్గానికి లక్షల చెట్లు పెంచాలనే నిబంధన విధిస్తూ ఆదేశాలు కూడా జారీ చేస్తోంది.దీని కోసం కోట్లు వెచ్చించి మొక్కల సంరక్షణ కోసం ట్రీ గార్డులు,సేఫ్టీ మెజర్మెంట్లు తీసుకుంటూ వీటి సంరక్షణ కోసం ప్రత్యేక సిబ్బంధిని కూడా నియమించి ప్రత్యేక శ్రద్ధ మహిస్తోంది. ఊరూరా నర్సరీలను పెంచేందుకు తగిన పారితోషికాలు అందజేస్తుంది.సామాజిక వనాల పేరిట ఒక్కో మొక్కకు ఓ రేటు చొప్పున కేటాయిస్తూ వాటి బాధ్యతను సామాజిక వన పెంపకం దార్లకు అప్పగిస్తుంది.ఇంతవరకు బాగానే సంబంధిత రోడ్లు భవనాల శాఖ విస్తరణల పేరిట ఏపుగా పెరిగి మానులా తయారైన చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికివేయడం రోడ్లపై వెళ్లే పాదచారులు, వాహన చోదకులకు కొంత బాధాకరంగా ఉంటోందని పలువురు పేర్కొంటున్నారు.భూత్పూర్ జాతీయ రహదారి-44 నుంచి మహబూబ్‌నగర్ జిల్లా రోడ్డులో చెట్ల నరికివేసే చర్యలు గడిచిన పక్షం రోజులుగా ఆరంభించారు.ఇదివరకు 30అడుగుల వెడల్పుగా భావించిన అధికారులు ఒక లేయర్,రెండు లేయర్లు,మూడు లేయర్లలో మొక్కలు,చెట్ల పెంపకాన్ని విస్తృతంగా చేపట్టారు.మున్సిపాలిటీ మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించి పట్టణ,పల్లె ప్రకృతి వనాల పేరిట విస్తృతంగా చెట్ల పెంపకాన్ని చేపట్టింది.దీంతో ఏడాది కాలంగా చెట్లు ఏపుగా పెరిగి పెద్ద మానుతో పెద్ద వృక్షాలుగా మారాయి.అమానుషమేమిటంటే ఏపుగా మానులా తయారైన చెట్లను విస్తరణల పేరిట నిర్దాక్షిణ్యంగా,అమానుషంగా నరికి వేయడం దురదృష్టకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చింపోలి నాలుగు లేన్ల రోడ్ల నిర్మాణాలు చేపట్టే క్రమంలో చెట్లను నరికివేయక తప్పడం లేదని సంబంధిత అధికారులు పేర్కొంటూ చేతులు దులిపేసుకుంటున్నారు.భూత్పూర్ పరిధిలోని మహబూబ్‌నగర్ రోడ్‌లో దాదాపు ముప్పయ్ వేలకు పైగా మొక్కలు నాటినట్లు తెలుస్తోంది.మొక్కలు మహావృక్షాలుగా మారి మండు వేసవిలో పాదచారులు,వాహనచోదకులకు దారి పక్కన కొంత నీడనిస్తూ వారికి సేదతీరేందుకు ఆస్కారముండేది.వీటిని నేలమట్టం చేసి నరికివేయడంతో ఈ రహదారి పొడవునా నిలువనీడలేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్ల ప్రక్కన చెట్లను పెంచే సంస్కృతి ఈనాటిది కాదు మూడో శతాబ్దం నాటి అశోకుని కాలం నుంచే అమలులో ఉంది.పెద్ద పెద్ద చెట్లు దూలాలను ఇదే అదునుగా భావించి కొందరు వ్యాపారులు,దళారులు నరికివేయబడిన చెట్ల దూలాలను,మానులను తేరగా దొరికాయని భావిస్తూ లారీలు,ట్రాక్టర్లలో తమ స్వప్రయోజనాల కోసం తరలించుకుపోవడం విడ్డూరం.

భూత్పూర్-మహబూబ్‌నగర్ రోడ్డులో నరికివేయబడిన రోడ్ల ప్రక్క చెట్లు

రోడ్ల ప్రక్క చెట్ల నరికి డ్రైన్ నిర్మిస్తున్న దృశ్యం

రైతులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు సహకరించాలి..

బ్యాంకు అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్.. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల ప్రతినిధి,జనవరి 10 ప్రభాతవార్త : బ్యాంకర్లు రుణాలు అందజేయడంలో జిల్లా ప్రజలకు, రైతులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఐడిఓసి సమావేశ మందిరంలో బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్యాంకర్లతో జిల్లా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెల బ్యాంకు వారిగా గ్రామ పంచాయతీ, రైతు వేదికలలో ఎవరు ఎంత టార్గెట్ రీచ్ అయ్యారన్నది మీ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసుకుని ఉన్న సమస్యలను మా దృష్టికి తీసుకురావాలని అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో రైతులకు అవసరమయ్యే రుణాలు, విద్యకు సంబంధించిన రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా బ్యాంకర్ల వారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఏ సమస్య ఉందో వివరాలు ఇవ్వాలని అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. బ్యాంకర్ల వారిగా ఇచ్చే డేటా కరెక్ట్‌గా ఉండాలని, సంబంధిత అధికారులను ఎల్‌డిఎం ఆదేశించారు. గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో గొర్రెలకు, పశువులకు స్వయం ఉపాధి కోసం అందరి సహకారంలో కొన్ని పథకాలు తీసుకొస్తే బాగుంటుందని అన్నారు. నాబార్డు ద్వారా శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకుల వారిగా ప్రణాళికలు రూపొందించుకొని ఈ ఆర్థిక సంవత్సరం మెరుగు పరచాలని అన్నారు. పిఎం ఇబివై, పిఎం జెబివై ఇన్సూరెన్స్ పథకాలు అర్హులైన అందరికి అందేలా బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. ప్రణాళికా బద్దంగా రుణాలు చెల్లించేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌బిఐ దిభోజిత్ బౌర, ఎల్‌డిఎం అయ్యపురెడ్డి, జడ్పీ సీఈఓ కాంతమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందునాయక్, జిల్లా పశు సంవర్ధక అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్బిఐ, యూనియన్ బ్యాంకు, ఎపిజివిబి, తదితర బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్

ఇందిరమ్మ రాజ్యంతో సకల సౌకర్యాలు..!

- ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం..
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

అచ్చంపేట, జనవరి 10 ప్రభాతవార్త: మారుమూల గ్రామాల్లో జీవనం కొనసాగిస్తున్న ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలంటే ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యమవుతుందని, అనాటి ఇందిరమ్మ రాజ్యంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తలదాచుకోవడానికి గూడును కట్టించి కడుపు నింపుకోవడానికి రేషన్ షాపుల ద్వారా 9 సరుకులను అందించి పేదోడికి అండగా నిలిచిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం వంగూరు మండలంలోని ఉల్లంపల్లి, వెలుమలపల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు ఉల్లంపల్లి, వెలుమలపల్లి గ్రామాల్లో రేషన్ షాపులను ప్రారంభించారు. కొండారెడ్డిపల్లిలో నూతన లైబ్రెరి, బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు గ్రామాల్లో పర్యటించినప్పుడు ఆయా గ్రామాలాభివృద్ధికి దోహద పడుతామని, ఇచ్చిన మాట ప్రకారం ఉల్లంపల్లి గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటు చేస్తానని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా వంగూరు నుంచి ఉల్లంపల్లికి బీటీ రోడ్డు, బస్సు సౌకర్యం, అండర్ డ్రైనేజీ, హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేసి ఆయా గ్రామాల ప్రజల హామీలను నేరవేరుస్తానని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత మండలం కావడంతో ఈ మండలాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో వంగూరు మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి అగ్రగామీగా నిలిచేవిధంగా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి, సర్పంచ్‌లు అల్వాలరెడ్డి, క్యామ పరుశరాములు, బక్కయ్య, లింగమ్మ, ఎంపీటీసీ రమేష్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు పండిత్‌రావు, ప్రచార కమిటీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ పీఎసీఎస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు సలేశ్వరం, లక్ష్మారెడ్డి, యాదగిరిరావు, రఫి, రమేష్, విష్ణు, జనార్ధన్, గఫూర్ తదితరులు ఉన్నారు.

వెలుమలపల్లి గ్రామంలో రేషన్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పునాదులకే పరిమితమైన ఆసుపత్రి పార్కు..!

ఉప్పునుంతల,జనవరి 10 ప్రభాతవార్త : మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి నిర్మించారు ప్రారంభించారు. మండల ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఎంతో ఆశతో ఉన్న ప్రజలు ఆశలు అడియాశలయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రస్థాయి నుంచి అతిరథ మహారథులు ప్రారంభోత్సవంలో పాల్గొని మండల ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఎంతో ఆర్భాటంతో హంగామాలతో ప్రారంభించారు. ప్రారంభం రోజు ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన వైద్యులచే మెరుగైన సేవలు అందుతాయని, వారికి మనం మర్యాదపూర్వకంగా సహకరించాలని చెప్పిన అతిరథ మహారథులు, ప్రారంభోత్సవానికి పరిమితమైన వైద్యులు, వైద్య విధాన పరిషత్ పరిధిలోకి రావడంతో అన్నిరకాల వైద్య సేవలు అందుతాయని హామీ ఇచ్చారు. కానీ ఉప్పునుంతల మండలంలో వైద్య విధాన పరిషత్ సేవలు కాదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య సేవలపై మండల ప్రజలు ఆలోచిస్తున్నారు. 4 కోట్ల పైబడి నిర్మించిన ఆసుపత్రి ఆవరణలో పార్కు నిర్మించారు. వైద్య విధాన పరిషత్ పరిధిలో వైద్యం అందుకున్న రోగులకు రోగం నయం కావడానికి కొంతసేపు పార్కులో వ్యాయామం చేస్తే మెరుగవుతుందని పార్కు కోసం స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టారు. కాని పార్కులో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా కేవలం పునాది వరకే పరిమితమైంది. సదరు కాంట్రాక్టరు అధికారుల మెప్పుకోసం నాసిరకం పనులు చేసి అర్థాంతరంగా వదిలేశారు. 30 పడకల ఆసుపత్రికి వైద్యుల కరువు ఏర్పడినప్పటికి వైద్య విధాన పరిషత్ వారు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల ఇంత పెద్ద భవనం నిర్మించి ఎవరి కోసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే డా. వంశీకృష్ణప్రత్యేక చొరవ తీసుకొని 30 పడకల ఆసుపత్రికి వైద్య సిబ్బందిని నియమించి, మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

30 పడకల ఆసుపత్రి

ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తిచేసి సౌకర్యాలు కల్పించాలి..

ఆసుపత్రి నిర్మాణంపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్

గద్వాల ప్రతినిధి,జనవరి 10 ప్రభాతవార్త : ప్రభుత్వం కొత్తగా గద్వాల జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న 300ల పడకల ఆసుపత్రి పనులను పూర్తిచేసి అన్ని సౌకర్యాలు వెంటనే కల్పించాలని జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కలెక్టర్ ఛాంబర్‌నందు టిఎస్.ఎంఐడిసి, డిఎంహెచ్ఓ, ఇంజనీరింగ్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 300 పడకల జిల్లా ఆసుపత్రి అవసరమైన అన్ని వసతులతో భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. వైద్య కళాశాల,300 పడకల జిల్లా ఆసుపత్రి, నర్సింగ్ కళాశాలకు సంబంధించి ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ వివరాలు, మార్పులు, పనుల పురోగతి గురించి పూర్తి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి సంబంధించిన పూర్తి ప్లాన్‌ను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలక్ట్రిసిటి కలెక్షన్, తాగునీటి వసతి, ఇతర పనులు ఫిబ్రవరిలోపు పూర్తి చేయాలని, టిఎస్.ఎంఐడిసి ఇంజనీర్ అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారి నుండి ఆసుపత్రి గేటు వరకు సిసి రోడ్డు, ఆసుపత్రి భవనం వెనుకవైపు కంపౌండ్ వాల్, సెప్టిక్ ట్యాంక్ అదనపు నీటి అవుట్‌లెట్ పాయింట్ వద్ద సోక్‌పిట్ నిర్మించాలని అధికారులకు ఆదేశించారు. అన్నింటిని దృష్టిలో ఉంచుకొని జనరేటర్లను అమర్చాలని అన్నారు. జిల్లాలో పబ్లిక్ హెల్త్ సబ్ సెంటర్ పనుల పురోగతి గురించి తెలుసుకొని వాటి పనులను పూర్తి చేయాలని వైద్యశాఖ అధికారిని ఆదేశించారు. అలంపూర్ 100 పడకల ఆసుపత్రికి మిషన్ భగీరథ నీటి సరఫరా కనెక్షన్, డ్రైనేజీ సిస్టం పనులు పూర్తి చేయాలని అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఆసుపత్రి నందు వైద్యులు, వైద్య సిబ్బంది ఎంతమంది ఉన్నారని సూపరింటెండెంట్‌ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిఎంహెచ్ఓ శశికళ, సూపరింటెండెంట్ డా. కిశోర్, టిఎస్.ఎం.ఐ.డిసి జయపాల్‌రెడ్డి, ఏఈ రహీమ్ పాల్గొన్నారు.

ఆసుపత్రి ఆవరణలో నిరుపయోగంగా మారిన పార్కు

అమరచింతలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి..

మండల తహసిల్దార్‌కు వినతి పత్రం

అమరచింత,జనవరి 10,ప్రభాతవార్త: అమరచింత మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల తహసిల్దార్ షేక్ చాంద్ భాషకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు,అజయ్ మాట్లాడుతూ,అమరచింత మండలం తో పాటు మున్సిపాలిటీ అయిన ఆధార్ సెంటర్ కేంద్రం లేక మండల ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు.అలాగే ప్రజల దగ్గర ఉన్న ఆధార్‌లో ఆంధ్రప్రదేశ్ పేరు ఉన్నదని తెలంగాణ రాష్ట్రం మార్పు కోసం వనపర్తి జిల్లా కేంద్రంలో ఉన్న ఆధర్ కేంద్రానికి వెళ్లిన పనులు కావడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా వనపర్తి జిల్లా కలెక్టర్,ఈడియం స్పందించి అమరచింతలో ఆదర్శ సెంటర్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో బొగ్గు రఘు,విష్ణు,సాగర్,యుగంధర్,జానకి రాములు,రాకేష్,బాలకృష్ణ,రాజు,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆటోయూనియన్ అధ్యక్షుడి వేడుకలు..

దేవరకద్ర,జనవరి 10 ప్రభాతవార్త: దేవరకద్రలో బుధవారం శ్రీ వీరగురు ఆటోయూనియన్ అధ్యక్షు డు కుర్వరాము జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.స్థానిక కొత్త బస్టాండు వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆటో యూనియన్ సభ్యులు కేక్ కటౌచేసి స్వీట్లు పంచిపెట్టారు.అలాగే రాముకు కేక్‌తినిపించి,శాలువాలు కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ఉపాధ్యక్షుడు గోవిందు,ప్రధాన ఆకార్యదర్శి కోట్ల రామకృష్ణ,సభ్యులు సత్తి,బద్రి,కృష్ణ, వెంకటేశ్, జాఫర్,గుల్‌మొహ్మద్,అంజనేయులులతో పాటు ఆయా గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లు,ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా నా బాధ్యతను నెరవేరుస్తా..

చిన్నచింతకుంట,జనవరి 10 ప్రభాతవార్త : జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయ సంఘం జిల్లా ఛైర్మన్‌గా మండల పరిధిలోని నెల్లికొండి గ్రామానికి చెందిన ఎ. రంజిత్‌కుమార్ నియామకమయ్యారు. హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు సర్వేశ్వర్, ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు జిల్లా నూతన ఛైర్మన్ ఎ.రంజిత్‌కుమార్ తెలిపారు. నాకు ఇచ్చిన ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తినని ఆయన తెలిపారు. మానవ హక్కుల సాధనకై తమవంతు కృషి చేస్తానన్నారు. మానవ హక్కులు, సామాజిక న్యాయం సంఘం ఢిల్లీ కేంద్రంగా పని చేస్తుందని ఎప్పటికప్పుడు మానవ హక్కులకై నిరంతరం పోరాటం చేస్తానని ఆయన తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వాముల ఇరుముడిధారణ..

గోవర్ధన్‌చారి గురుస్వామి అధ్వర్యంలో పూజలు

దేవరకద్ర,జనవరి 10 ప్రభాతవార్త: లాల్‌కోటలో బుధవారం అయ్యప్పస్వాముల ఇరుముడిధారణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవస్థానంలో గోవర్ధనాచారి గురుస్వామి అధ్వ ర్యంలో లాల్‌కోట కెంగూరి అంజన్నయాదవ్ నారికేళి గురుస్వామి ఈ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలోని అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజల అనంతరం అయ్యప్పస్వాముల ఇరుముడిధారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అయ్యప్పమాలలు వేసిన స్వాములంతా ఇరుము డిధారణ చేశారు.వివిధప్రాంతాలనుండి వచ్చిన అయ్యప్పస్వాముల బందువులు వారికి పూతన వస్త్రాలను అందజేశారు.అలాగే అయ్యప్పస్వాములు సద్ది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇరుముడి ధారణ అనంతరం అయ్యప్పస్వాములు శబరిమలకు బయలుదేరి వెళ్ళారు. ఈ కార్యక్రమానికి అయ్యప్పస్వాముల బందువులు,భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. దీంతో దేవస్థానం అయ్యప్పస్వాములతో కిటకిటలాడింది.

మాజీ సర్పంచ్ పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

ఉప్పునుంతల, జనవరి 10 ప్రభాతవార్త : మండలంలోని తాడూరు గ్రామ సర్పంచ్ మంద జంగిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ అకస్మాత్తుగా మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం ఉదయం విషయం తెలుసుకుని తాడూరు గ్రామానికి చేరుకున్న అచ్చంపేటఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ మాజీ సర్పంచ్ మంద జంగిరెడ్డి స్వగృ హానికి వెళి ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, తిప్పర్తి నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు. అదేవిధంగా తాడూరు గ్రామానికి చెందిన వంగ మొగులాల్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గతవారం క్రితం చనిపోవడంతో ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ మొగులాల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యార్థులను ప్రోత్సహిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ,జనవరి 10 ప్రభాతవార్త: విద్యార్థులు విద్య ద్వారానే ఉన్నత స్థాయికి చేరుకుంటారని, ఆ దిశగా విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందంరెడ్డి చేపట్టిన సేవలు ఎంతో అమోఘమని ఎంపీటీసీ నీరటి రాములు అన్నారు. మండల పరిధిలోని కొట్ర పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు రాఘవేందర్‌రెడ్డి సమకూర్చి అందించిన స్కాన్‌అండ్ లెర్న్‌పుస్తకాలను విద్యార్థులకు అందించారు.అవకాశాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులు విద్యలో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎమ్‌సీచైర్మన్ కడారిజంగయ్య,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు,అల్లాజీ, సద్దాం, మల్లేష్, శాంపూరి లక్ష్మయ్య, ఫౌండేషన్ సభ్యులు రమేష్‌నాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి...

వెల్దండ,జనవరి 10 ప్రభాతవార్త: మండలంలోని అజిలాపూర్ గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ అజిలాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్దగోని రమేష్‌గౌడ్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్ మాట్లాడుతూ అజిలాపూర్ గేటు నుంచి భైరాపూర్‌వరకు బీటీరోడ్డు నిర్మాణం,అజిలాపూర్‌కు విద్యుత్ సరఫరా, భైరాపూర్ సబ్‌స్టేషన్ నుంచికాకుండా ఇర్విన్‌సబ్‌స్టేషన్ నుంచి అందించాలని,సీసీరోడ్లు,అండర్ డ్రైనేజీనిర్మాణం,ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు.కార్యక్రమంలో కాలే వెంకటేష్‌కురుమ, విష్ణువర్ధన్‌రెడ్డిలు ఉన్నారు.

జిల్లా నూతన కలెక్టర్‌ను కలిసిన అలంపూర్ ఎమ్మెల్యే

ఇటిక్యాల జనవరి 10 ప్రభాతవార్త: జోగులాంబ గద్వాల జిల్లా నూతన కలెక్టర్‌గా మూడు రో జుల క్రితం బి. యం. సంతోష్ పదవి బాధ్య తలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వ కంగా అలంపూర్ ఎమ్మె ల్యే విజయుడు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట నాయకులు పరమేశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా విచారణ చేపట్టాలి..!

వ్యవస్థాకృత కేసులపై దృష్టి సారించాలి: నెలవారి సమీక్షలో ఎస్పీ హర్షవర్ధన్

హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది

మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 10 ప్రభాతవార్త : ప్రతి కేసులలో పారదర్శకంగా, పకడ్బందీగా విచారణ చేపట్టాలని, కేసులలో నిందితులకు పడే శిక్షల శాతాన్ని పెంచాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. 2022 బ్యాచ్‌కి చెందిన నూతన ప్రొబేషనరీ ఐపిఎస్ చిత్తరంజన్‌కు జిల్లా తరపున వెల్‌కమ్ చెప్పి, అధికారులకు పరిచయం చేశారు. వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పారదర్శకంగా విచారణ చేపట్టి ఆయా కేసులలో నిందితులకు పడేశిక్ష శాతాన్ని పెంచాలని ఎస్పీ అధికారులకు సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ హాల్‌లో సర్కిల్ వారిగా పోలీస్ అధికారులతో ఎస్పీ నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల పూర్తి అయినందున పోలీస్ అధికారులు వ్యవస్థీకృత నేరాలపై దృష్టి పెట్టాలని, నమోదు అయిన ప్రతి కేసులో పారదర్శకమైన లోతైన విచారణ చేపట్టాలని అన్నారు. పోలీస్ స్టేషన్‌ల వారిగా గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల వివరాలను, యుఐ కేసుల వివరాలను పరిశీలించారు. గ్రేవ్ కేసులలో యుఐలో ఉండడానికి గల కారణాలను పరిశీలించి కేసులను ఛేదించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఎస్టీ, ఎస్సీ కేసుల వివరాలను, నమోదు అయిన పోక్సో కేసు వివరాలను పరిశీలించి ఆయా కేసులలో శిక్షల శాతాన్ని పెంచేందుకు పోలీసు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాంటెస్టెడ్ కేసులు కోర్టు ట్రయల్స్ నడిచే సమయంలో సాక్షులను పకడ్బందీగా బ్రీఫ్ చేస్తూ ఎప్పటికప్పుడు కేసులకు సంబంధించిన విషయాలను బాధితులకు అప్‌డేట్ చేస్తూ కేసులలో నిందితులకు పడే శిక్షల శాతాన్ని మరింత పెంచాలని సూచించారు. అలాగే మహిళలకు వ్యతరేకంగా జరిగే నేరాలు అయిన పోక్సో కేసులలో కూడా నిందితులకు పడే శిక్షల శాతాన్ని పెంచేందుకు పోలీస్ అధికారులు కృషి చేయాలని సూచించారు. దొంగతనాల కేసులను చేదించడంలో పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, అందుకు తగిన ప్రణాళిక రచించి ముందుకెళ్లాలని ఆదేశించారు. దొంగతనాల కేసులలో నిందితులను లోతుగా విచారించాలని, వీలైనంత త్వరగా ఆయా కేసులను చేదించాలని ఆదేశించారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు, అరెస్టులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ప్రొబేషనరీ ఐపిఎస్ చిత్తరంజన్, ఎఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీలు మహేష్, డిసిఆర్‌బి డీఎస్పీ జి.వి.రమణరెడ్డి, ఎస్బీ డీఎస్పీ కిరణ్, సైబర్ క్రైమ్ డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి, ఎఓ రుక్మిణి, ఎస్పీ సిసి రామ్‌రెడ్డి, ఇన్స్‌పెక్టర్‌లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్

మాజీ ఎమ్మెల్యే ఆల కుటుంబాన్ని పరామర్శించిన పలువురు నాయకలు..!!

మాజీ ఎమ్మెల్యే ఆల సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డికి నివాళి అర్పిస్తున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్,బీజేపీ రాష్ట్ర నాయకుడు డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి,ఎగ్గని నర్సింహులు

భూత్పూర్,జనవరి 10,ప్రభాతవార్త: మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వంరెడ్డి ఆయన కుటుంబాన్ని బుధవారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ బీజేపీ రాష్ట్ర నాయకులు డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఆల సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డి ఈ నెల 4వ తేదిన గుండెపోటుతో మృతి చెందిన విషయం విధితమే.బుధవారం బీజేపీ రాష్ట్ర నాయకులు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్,బీజేపీ రాష్ట్ర నాయకులు డోకూర్,ఎగ్గని నర్సింహులుతో పాటు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గొడుగు అంజనేయులు,పట్టణ అధ్యక్షుడు గంగాపురం రవీందర్,సత్తయ్యగౌడ్ తదితరులు మాజీ ఎమ్మెల్యే స్వగ్రామం భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామానికి చేరుకుని ఆల కుటుంబ సభ్యుల్ని పరామిర్శించి తమ తీవ్ర సంతాపాన్ని తెలిపారు.

మాతృ మరణాలు అరికట్టాలి: ప్రత్యేక దృష్టి సారించాలి..

మహబూబ్‌నగర్ కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశం: జిల్లాస్థాయి కమిటి సమావేశం

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 10 ప్రభాతవార్త : మహిళ గర్భం దాల్చినప్పటి నుండి ప్రసవం అనంతరం వరకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముఖ్యంగా మాతృ మరణాలు సంభవించకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ రవినాయక్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని తన చాంబర్‌లో నిర్వహించిన మాతృ మరణాల సమీక్ష జిల్లాస్థాయి కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యారోగ్యశాఖలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయి నుండి జిల్లాస్థాయి వరకు ఆశ, ఎఎన్ఎం, డాక్టర్లతో పటిష్టమైన వ్యవస్థ ఉందని, ఈ వ్యవస్థపై ప్రజలకు మంచి నమ్మకముందని అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలిపే విధంగా మహిళ గర్భం దాల్చినప్పటి నుండి సుఖ ప్రసవం అయ్యేవరకు అలాగే ప్రసవానంతరం సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ప్రసవం సందర్భంగా మాతృ మరణాలు సంభవించడానికి వీలు లేదని ఆవిధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన వైద్యాధికారులను ఆదేశించారు. మాతృ మరణాల సమీక్ష కమిటి సభ్యులు ఇతర జిల్లాలలో మాతృ మరణాల కేసులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ అలాంటి మరణాలు సంభవించడానికి గల కారణాలను విశ్లేషిస్తూ మన జిల్లాలో అలాంటి కేసులు రాకుండా సలహాలు, సూచనలు ఇవ్వాలని చెప్పారు. మాతృ మరణాలను అరికట్టేందుకు మహిళగర్భం దాల్చినప్పటి నుండి క్రమం తప్పకుండా పరీక్షలు చేయడంతో పాటు మందులు, పరీక్షలు నిర్వహించాలని, ఇందుకుగాను గ్రామస్థాయి నుండి ఆశ మొదలుకొని ఎఎన్ఎంలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, అదేవిధంగా సీరియస్ కేసులలో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే కేసులను సైతం జిల్లాస్థాయి వైద్యాధికారులు, జిల్లా ప్రధాన ఆసుపత్రి వైద్యులు పూర్తి జాగ్రత్తలు తీసుకుని వారు పూర్తి ఆరోగ్యంగా సుఖ ప్రసవం అయ్యేలా చూడడమే కాకుండా ప్రసవానంతరం ఎలాంటి చెడు సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. కృష్ణ, డిప్యూటి డిఎంహెచ్ఓ డా. భాస్కర్‌నాయక్, డిప్యూటి డిఎంహెచ్ఓ డా. శ్రీధర్‌రెడ్డి, ఐఎంఎ నుండి డా. రామ్మోహన్, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ నటరాజ్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి గైనకాలజీ డాక్టర్లు రాధ, లక్ష్మి పద్మప్రియ, బాదేపల్లి, సిహెచ్‌సి సూపరింటెండెంట్ డా. సోమశేఖర్, పిహెచ్‌సి డాక్టర్లు సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

లింగాల,జనవరి10 ప్రభాతవార్త: వ్యవసాయపొలంలో విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్త చెరువుతండాలో బుధవారం చోటు చేసుకుంది.గ్రామస్తులు తెలిపనవివరాల ప్రకారం ఈవిధంగా ఉన్నాయి.కొత్తచెరువు తండాగ్రామానికి చెందిన మూడవత్ సామ్యా (60) దినసరి మాదిరిగానే పొలంలోవేసిన వేరుశనగ పంటకు కాపలాగా వెళ్లేవాడు. కాగా అదే గ్రామానికి చెందిన తన అల్లుడు హంక్య వేరుశనగ పంటకు పందుల బెడద నుంచి రక్షించుకోవడానికి పొలం చుట్టు కంచెకు విద్యుత్ అమర్చి, విద్యుత్ ఆన్‌చేసి మంగళవారం రాత్రి తన ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం 4 గం.ల సమయంలో తన మామ పొలం వద్దకు వెళ్లాడు. విద్యుత్ వైర్లు గమనించని మృతుడు (సామ్యా) పొలంలోకి వెళ్లగానే విద్యుత్ వైర్లు తన కాళ్లకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. చనిపో యిన తన తండ్రిని చూసి కూతురు బోరున విలపించింది. ఈ విషయంపై పోలీసులను అడగగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి..

ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి కవిత.. గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేత

మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి

కొత్తకోట,జనవరి 10,ప్రభాతవార్త: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అప్పుడే సభ్యసమాజం గౌరవించబడుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సతీమణి కవిత అన్నారు.బుధవారం కొత్తకోట పట్టణ కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ఆవరణలో కొత్తకోట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుంత సురేష్,సభ్యులు విశ్వనాథ వెంకటరమణ,మహిళా అధ్యక్షులు కొండ స్వప్న కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిలుగా ఎమ్మెల్యే సతీమణి పాల్గొని గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి హారిక రెడ్డి 4 తులాల వెండి,రెండో బహుమతి స్వర్ణలత 3 తులాల వెండి,మూడో బహుమతి శ్యామల 2 తులాల వెండి,నాలుగో బహుమతి శైలజ 1 తులం వెండిని బహుమతిగా అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించిన ఆర్యవైశ్య కమిటీ సభ్యులను అభినందించారు.ఇలాంటి మంచి కార్యక్రమాలు అప్పుడప్పుడు నిర్వహించి మహిళలను చైతన్య పరచాలని కోరారు.అవసమైతే నా సహకారం తప్పకుండా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్,ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్,సిడిసి చైర్మన్ చెన్నకేశవ రెడ్డి,మాజీ ఎంపీపీ రావుల జితేంద్రనాథ్ రెడ్డి,రామకృష్ణ పురం సర్పంచ్ శివరాములు,చర్లపల్లి సర్పంచ్ శేఖర్ రెడ్డి,కౌన్సిలర్లు,మాజీ ఎంపీపీలు,మాజీ జడ్పీటీసీలు,మాజీ చైర్మన్లు,ఎంపీటీసీలు,సర్పంచులు,డైరెక్టర్లు మండల గ్రామ నాయకులు,మహిళలు పాల్గొన్నారు.

మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ క్యాసారపు వెంకటయ్యకు ఘన సన్మానం

క్యాసారపు వెంకటయ్యను సన్మానిస్తున్న దృశ్యం

వెల్దండ, జనవరి 10 ప్రభాతవార్త: జిల్లా మత్స్యశాఖ సొసైటీ డైరెక్టర్‌గా వెల్దండ మండల కేంద్రానికి చెందిన క్యాసారపు వెంకటయ్యము దిరాజ్ ఇటీవల ఎన్నికయ్యారు. సొసైటీ డైరెక్టర్‌గా ఎన్నిక కావడంతో బుధవారం వెల్దండ మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాల యంలో మండల ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో క్యాసారపు వెంకటయ్యను శాలువాలతో ఘనంగా సన్మానించి స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ మత్స్యశాఖను అభివృద్ధి పథంలో నడిపిం చాలని, మత్స్యశాఖలోని సమస్యలను పరిష్కరించి ముదిరాజ్‌లను అభివృద్ధి పర్చాలన్నారు. సన్మానించిన వారిలో మండల ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు బాదేపల్లి మల్లేష్ ముదిరాజ్, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్ ముదిరాజ్, నాయకులు లింగం ముదిరాజ్, బాలరాజు, భయ్య మల్లయ్య, చంద్రయ్య, గణేష్, నర్సింహ్మ ముదిరాజ్, శ్రీశైలం ముదిరాజ్, మల్లేష్, పిల్లి దేవేందర్, లాలయ్య, శంకర్, బాలకృష్ణ, శివ, తిరుపతి(రాజు) ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

మంత్రి జూపల్లిని కలిసిన అలంపూర్ కాంగ్రెస్ నాయకుడు ఇస్మాయిల్

ఇటిక్యాల జనవరి 10 ప్రభాతవార్త: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును హైదరాబాదులోని ఆయన నివాసంలో బుధవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇస్మాయిల్ వంరికొండరితో నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా మంత్రి జూపల్లి కృష్ణారావును వారు కలిశారు. ఈ సందర్భంగా అలంపూర్ మండల అభివృద్ధి కోసం కృషి చేయాలని వారు మంత్రిని కోరారు. వీరి వెంట ఎంపిటిసి రఫీ, ఉపసర్పంచు నరసింహ, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తాం..

పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్యే విజయుడు

ఇటిక్యాల జనవరి 10 ప్రభాతవార్త: అలంపూర్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తామని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. బుధవారం అలంపూర్ మండలంలోని సింగవరం గ్రామంలో, నూతనంగా నిర్మించిన పాఠశాల అదనపు గదిని జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు స్థానిక సర్పంచు అనితతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.5349 ధర పలికిన కింటాల్ ఆముదాలు..

దేవరకద్ర,జనవరి 10 ప్రభాతవార్త: దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డుకు బుధవారం రైతులు 20 క్వింటాళ్ళ ఆముదాలను విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా క్వింటాలుకు రూ.5349 ధర పలికింది. అతి తక్కువగా కూడ అంతే ధర పలికింది.అలాగే 25 కింటాళ్ళ కందులను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.8951 ధర పలికింది.అలాగే అతి తక్కువగా రూ.8901 ధర పలికింది.265 కింటాళ్ళ ఉల్లిని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.వీటికిఅత్యదికంగా కింటాల్‌కు రూ.2000ధర పలికింది.అలాగే అతి తక్కువగా రూ.1530ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

నల్లబెల్లం స్వాధీనం : ఒకరిపై కేసు నమోదు

లింగాల,జనవరి10 ప్రభాతవార్త: అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. లింగాల మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి కొల్లాపూర్ నియోజకవర్గం ముక్కిడి గుండం గ్రామానికి చెందిన బిజినేపల్లి భాస్కర్‌శెట్టి బొలేరో వాహనంలో 9 క్వింటాళ్ల నల్లబెల్లం అక్రమంగా బొలేరోవాహనం ఎపి29బిహెచ్ 8806లో లింగాల మండల పరిసరప్రాంతాల్లో గుడుంబా తయారుచేసి వారికి సరఫరా చేస్తున్నారని తెలిపారు.పక్కా సమాచారంతో పోలీసులు అక్రమంగా తరలిస్తున్న బొలేరో వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు.అందులో లభ్యమైన 9క్వింటాళ్ల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా నల్లబెల్లం సరఫరాకు వినియోగించిన బొలేరో వాహనంతో పాటు బిజినేపల్లి భాస్కర్‌శెట్టిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అభివృద్ధి చెందే దేశంగా చేయడమే మోడీ లక్ష్యం..

బిజెపి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి

మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 10 ప్రభాతవార్త : అభివృద్ధి చెందే దేశంగా చేయాలని మోడీ సంకల్పమని ఆదిశగా మనమందరం కూడా సహకరించాలని బిజెపి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి తెలిపారు.హన్వాడలో వికసిత సంకల్పయాత్రలో అగ్రికల్చర్ ఆఫీసర్స్, బ్యాంక్‌అధికారులు,గ్య

ఎమ్మెల్యేకు మహేశ్వరుడి ఆహ్వాన పత్రిక

ఆహ్వాన పత్రికను అందిస్తున్న దృశ్యం

అచ్చంపేట, జనవరి 10 ప్రభాతవార్త: ఈ నెల 15 నుంచి 22 వరకు ఉమ మహేశ్వరుడి బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. బుధవారం ఉత్సవాలకు హాజరు కావాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు ఆలయ చైర్మన్ కందూకూరి సుధాకర్, ఈఓ శ్రీనివాస్‌రావు ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ప్రేమ్‌నాయక్, డీఈఈ హేమలత, బల్మూర్ ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, డీఎల్‌పీఓ వెంకటయ్య ఉన్నారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఏఓ

వెల్దండ, జనవరి 10 ప్రభాతవార్త: మండల కేంద్రంతో పాటు అజిలాపూర్ గ్రామంలోని ఎరువుల దుకాణాలను గురువారం మండల వ్యవసాయాధికారిణి మంజుల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల డీలర్లతో మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్ నందు ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలన్నారు. పీఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే ఎరువుల అమ్మకాలు చేపట్టాలని, స్టాక్ బోర్డు నందు ఎప్పటికప్పుడు ఎరువుల వివరాలను నమోదు చేయాలన్నారు. కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ హబీబున్నిసాతో పాటు డీలర్లు ఉన్నారు.

కళాశాలను తనిఖీ చేసిన ఇంటర్ బోర్డు విద్యాధికారి

అధ్యాపకులకు సూచనలు చేస్తున్న ఇంటర్ బోర్డు విద్యాధికారి

వెల్దండ, జనవరి10 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్ బోర్డు విద్యాధికారి జీ.వెంకటరమణ బుధవారం కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాలలోని రికార్డులను వెంకటరమణ పరిశీలించి అనంతరం మాట్లాడుతూ ఫిబ్రవరిలో నిర్వహించే పరీక్షల్లో విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి 100 శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, ఎజీఎంసీ విజయలక్ష్మి, శివప్రసాద్, ప్రవీణ, షణ్ముక రెడ్డి తదితరులు ఉన్నారు.

డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

వెల్దండ, జనవరి 10 ప్రభాతవార్త: డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సౌత్ ఈస్ట్ జోన్ బాధ్యతలు చేపట్టిన జానకిని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్ హైదరాబాద్‌లోని ఆమె చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

యువకుడికి ఆర్థిక సాయం అందజేత

బిజినేపల్లి,జనవరి10 ప్రభాతవార్త: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విన య్‌ను హైదరాబాద్‌లోని మమత ఆసుపత్రిలో ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్ కలిసి పరామర్శించారు. పాలెం గ్రామానికి చెందిన వినయ్ కోలుకుంటున్నట్లు తెలిపారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రతి ఒక్కరు పేదవాడైన వినయ్‌కి వైద్య ఖర్చుల నిమిత్తం అండగా ఉండాలని కోరారు.

విద్యార్థినీ కుటుంబానికి పరామర్శ

వీపనగండ్ల, జనవరి 10, ప్రభాతవార్త: వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన ఇటీవల మరణించినటువంటి వర్షా విద్యార్థినీ కుటుంబా నీ జూపల్లి అరుణ్ గురువారం నాడు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మరణ వార్త విని తామంతా దిగ్భ్రాంతికి గురయ్యామని విద్యార్థి ఎన్నో ఆశలతో చదువులు కొనసాగించేటటువంటి వాళ్లు మానసికమైనటువంటి ఆలోచనలు లోనయి చదువుల ఒత్తిడితో చనిపోవడం బాధాకరమైనటువంటి విషయమని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఆమె తల్లిదండ్రులు బీరయ్య వారికి తమ సానుభూతిని వ్యక్తం చేశారు. అదేవిధంగా గత నాలుగు రోజుల కిందట వీపనగండ్ల గ్రామానికి చెందిన చేన్న మౌని రవి విద్యుత్ గా దానికి గురై గోవర్ధనగిరి గ్రామంలోని మామిడి తోటలో చనిపోయిన విషయం విధితమే ఆయనతల్లి దండ్రులను చిన్నమనిబాలయ్య కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు వారితోపాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రవీందర్ రెడ్డికి ఖాళీ గాయమై అనారోగ్యానికి గురి కావడంతో ఆయనను కూడా కార్యకర్త రవీందర్‌రెడ్డి కి ఖాళీ గాయమై అనారోగ్యానికి గురి కావడంతో ఆయనను కూడా పరామర్శించి ధైర్యంచెప్పారు. వీరితోపాటు గోదారి గ్రామానికి చెందిన వెంకటరామరెడ్డి బైకుపై కిందపడి కాలికి గాయం కావడంతో ఇబ్బంది పడుతున్నఆయనను కూడా జూపల్లి అరుణ్ ఆగ్రామంలో పరామర్శించారు. ఈయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోదాల బీరయ్య యాదవ్ చాకలిమునికొండ గోపి బస్వరాజ్‌గౌడ్ నక్క విష్ణు వంగల వెంకట రెడ్డి కావలి మహేష్‌నాయుడు గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వెంకట్ స్వామి పెంటయ్య తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 100శాతం ఉత్తీర్ణత శాతం పెంచాలి

కల్వకుర్తి, జనవరి10 ప్రభాతవార్త: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 100 శాతం ఉత్తీర్ణత శాతం పెంచాలని డీఐఈఓ వెంకటరమణ అన్నారు. బుధవారం కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలను అకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల సిలబస్ గురించి టీచింగ్ డైరీస్, హాజరు రిజిస్టర్‌లను డీఐఈఓ వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మెరుగైన ఉత్తీర్ణత శాతం రాబట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, వేణయ్య, సదానందంగౌడ్, మల్లేష్, నయీమ్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈఓ వెంకటరమణ

ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పదు

● మండల విద్యాధికారి లక్ష్మణ్‌సింగ్

చిన్నచింతకుంట, జనవరి 10 ప్రభాతవార్త: ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పదని మండల విద్యాధికారి లక్ష్మణ్‌సింగ్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన జిహెచ్ఎం రామలింగం వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపా ధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఈ వృత్తిలో ఉన్న గురువులు ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది తమ వృత్తిలో సంతృప్తి చెందు తారన్నారు. పాఠశాల జిహెచ్ఎంగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులను సక్రమమైన మార్గలో నడిపించిన రామలింగం ఎప్పటికీ విద్యార్థుల గుండె ల్లో నిలుస్తారని ఆయన తెలిపారు. పాఠశాలను అటు విద్యార్థులను తీర్చి దిద్ది ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన జిహెచ్ఎం రామలింగంను పలువురు కొనియాడారు. అనంతరం జిహెచ్ఎం రామలింగం మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలు పైగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు

బదిలీపై వెళ్లిన జిహెచ్ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

నిర్వహిస్తూ విద్యార్థుల చక్కటి భవిష్యత్తుకై తనవంతు కృషి చేశానని ఆయన తెలిపారు. బదిలీపై ఎక్కడికి వెళ్లినా ఇక్కడి విద్యార్థులు చదువుల్లో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం జిహెచ్ఎంను శాలువా పూలమాలలతో సత్కరించారు. తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మండల బాధ్యులు రవి కుమార్‌లు జిహెచ్ఎంను సత్కరించారు. సమావేశంలో స్థానిక సర్పంచ్ మోహన్‌గౌడ్, కోఆప్షన్‌మహమూద్, యాకోబ్, ఇంఛార్జి ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

యాంత్రీకరణ వ్యవసాయం లాభదాయకం

వ్యవసాయ పరిశోధన సహ సంచాలకులు డా.ఎం మల్లారెడ్డి

బిజినేపల్లి,జనవరి10 ప్రభాతవార్త: వ్యవసాయంలో రైతులు యాంత్రీకరణ పద్ధతులు పాటించడం లాభదాయకమని పాలెం వ్యవసాయ పరిశోధన సహ సంచాలకులు డా. ఎం. మల్లారెడ్డి సూచించారు. అల్లిపూర్ గ్రామంలో బుధవారం వేరుశనగ డిగ్గర్‌పై క్షేత్ర ప్రదర్శన రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు వేణుగోపాల్ క్షేత్రంలో నిర్వహించారు. డా. ఎం.మల్లారెడ్డి మాట్లాడుతూ వేరుశనగ పంట సాగులో అధిక పెట్టుబడి పంట కోత కోయడానికి ఖర్చవుతుందని తెలిపారు. రైతన్నకు ఖర్చు తగ్గించడానికి యాంత్రీకరణ పద్ధతులు తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈవిధానం వల్ల రాబోయే రోజుల్లో కూలీల కొరత తగ్గించుకోవడంతో పాటు పంట దిగుబడి ఆదాయాన్ని పెంచుకోవచ్చని చెప్పారు. కృషి విజ్ఞానకేంద్రం సమన్వయకర్త టి. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడు తూ వేరుశనగ డిగ్గర్ ఎటువంటి నేలల్లో, ఎంత తేమా ఉంటే ఎలా పని చేస్తుందో రైతులకు వివరించారు. వి. రామిరెడ్డి శాస్త్రవేత్త వేరుశనగ రకాలు వాటిలో ఉండే కల్తీలు, గిర్నార్ ఫోర్ రకం గురించి వివరంగా రైతులకు తెలియజేశారు. అలాగే కార్యక్రమంలో డా. విజయలక్ష్మిశాస్త్రవేత్త, కె. స్రవంతి శాస్త్రవేత్త, కె. రామకృష్ణ, ఎ. నవతా శాస్త్రవేత్తలు, మండల వ్యవ సాయ అధికారినీతి, మండలవిస్తరణఅధికారిమధు65 మంది రైతులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట దిగుబడిపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న డా. ఎం.మల్లారెడ్డి

తప్పనిసరిగా ఈ కేవైసి చేసుకోవాలి : తహసీల్దార్

చిన్నచింతకుంట, జనవరి10 ప్రభాతవార్త: రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డులను ఈ కేవైసి చేసుకోవాలని మండల తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. బుధవారం మండల మహిళా సమాఖ్య సమావేశ హాల్‌లో మండల రేషన్ డీలర్ల సమావేశంలో పై విధంగా మాట్లాడారు. లబ్దిదారులు తమ ఆధార్ కార్డులను ఈ కేవైసి చేసుకుంటేనే రేషన్‌బియ్యాన్ని పొందుతారని లేనిపక్షంలో రేషన్ బియ్యం రావన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రేషన్‌కార్డు లబ్దిదారులు తమ ఆధార్ కార్డులను ఈ కేవైసి చేసుకునేలా రేషన్ డీలర్లు ఒత్తిడి తీసుకురావాలని తహసిల్దార్ ఆదేశించారు. అంతకు ముందు తహసిల్దార్ కార్యాలయంలో అభయహస్తం దరఖాస్తులను ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. త్వరిత గతిన దరఖాస్తులను కంప్యూటరీకరణ పూర్తి చేయాలని తహసిల్దార్ ఆదేశించారు. సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ వరప్రసాద్, డిప్యూటి తహసిల్దార్ శేఖర్, ఆర్ఐ తిరుపతయ్యతో పాటు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణయ్య

గిరిజనులు ఆధార్‌ను తప్పనిసరిగా వినియోగించుకోవాలి

● బిజెపి మండలాధ్యక్షులు యాదగిరి సలేశ్వరం

లింగాల,జనవరి 10 ప్రభాతవార్త: మారుమూల ప్రాంతాల్లో గిరిజనులు అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం జన్‌మన్ యోజన) పథకం ప్రవేశపెట్టిందని చెంచులు ఈ ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిజెపి మండలాధ్యక్షులు యాదగిరి సలేశ్వరం కోరారు. బుధవారం లింగాల మండల కేంద్రంలోని రైతు వేదికలో చెంచుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చెంచులకు పీఎం జన్‌మన్, కింద ఉచితంగా కిసాన్ క్రెడిట్ కార్డులు, ఆధార్ కార్డులు, జన్‌మన్ బ్యాంకు అకౌంట్, ఆయుష్మాన్ భారత్ కార్డులను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని చెంచులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఎంసి జిల్లా మేనేజర్ శివ, విష్ణు చారి, ఆంజనేయులు, మహేష్, సలేశ్వరం, గోవిందు పాల్గొన్నారు.

చెంచుల ఆధార్ నమోదు కార్యక్రమంలో జిల్లా మేనేజర్ శివ, సలేశ్వరం

రైస్‌మిల్లర్లు లక్ష్యాలను పూర్తి చేయాలి

రైస్ మిల్లర్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్

గద్వాల ప్రతినిధి,జనవరి 10 ప్రభాతవార్త: ఖరీఫ్, రబీకి సంబంధించిన కస్టమ్స్, మిల్లింగ్ రైస్ (బియ్యం)ను ఈనెల 20 వరకు రైస్ మిల్లర్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించి ఆయా మిల్లర్లు బియ్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ఇచ్చే సిఎంఆర్ బియ్యాన్ని లక్ష్యాన్ని పూర్తి చేయాలని అన్నారు. ప్రతి రోజు మిల్లింగ్ కెపాసిటిని బట్టి రైస్‌ను 100 శాతం పూర్తి చేయాలని అన్నారు. ప్రతిరోజు మిల్లుకు ఉన్న కెపాసిటిని బట్టి డైలీ టార్గెట్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఒక్కో రైస్ మిల్లును రివ్యూ నిర్వహించి వారికి కేటాయించిన బియ్యం, ఉన్న బ్యాలెన్స్‌ను మిల్లు కెపాసిటిని బట్టి 10 రోజులలో ఖరీఫ్, రబీ ధాన్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా బియ్యం అందించని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు, డిఎం విమల, కనకయ్య, మంగమ్మ, రైస్ మిల్లర్లు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్

నాబార్డు కరదీపికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

గద్వాల ప్రతినిధి,జనవరి 10 ప్రభాతవార్త: నాబార్డు ద్వారా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ కరదీపికను జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ఆవిష్కరించారు. నాబార్డు ప్రతి జిల్లాకు ప్రతి సంవత్సరం పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ (పిఎల్‌పి)ని సిద్ధం చేస్తుంది. ప్రాధాన్యతా విభాగంలో జిల్లాలో అందుబాటులో ఉన్న భౌతిక, ఆర్థిక సామర్థ్యాన్ని అంచనా వేస్తుంది. దీన్ని ఆధారంగా చేసుకుని జిల్లాలోని లీడ్ బ్యాంక్ జిల్లాలోని వివిధ బ్యాంకుల ద్వారా అమలు చేయడానికి వార్షిక జిల్లా క్రెడిట్ ప్లాన్ (ఎసిపి)ని సిద్ధం చేస్తుంది. దీని ప్రకారం గద్వాల జిల్లాకు సంబంధించిన 2024,25 పిఎల్‌పిని బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించారు. పంట ఉత్పత్తి, నిర్వహణ మార్కెటింగ్ కోసం రూ. 3161 కోట్లు, వ్యవసాయం అనుబంధ కార్యకలాపాల కోసం టర్మ్‌లోన్ రూ. 475.57 కోట్లు, వ్యవసాయం మౌలిక సదుపాయాల కోసం రూ. 96.32 కోట్లు, అనుబంధ కార్యకలాపాల కోసం రూ. 357.34 కోట్లు, సూక్ష్మ చిన్న మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈ) కోసం రూ. 474.47 కోట్లు సహా జిల్లా మొత్తం ప్రాధాన్యత రంగానికి రూ. 4721.77 కోట్లుగా నాబార్డు ఆర్థిక అంచనా వేసింది. కలెక్టర్‌తో పాటు వ్యవసాయ అధికారి గోవిందనాయక్, పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పోరేషన్ ఈడి రమేష్‌బాబు, పి. షణ్ముఖాచారి, డిడిఎం, నాబార్డు అయ్యపు రెడ్డి, ఎల్‌డిఎం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాల్గొన్నారు.

నాబార్డు కరదీపికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్

వాహనదారుల పెండింగ్ చాలన్లు ఈ నెల 31 వరకు చెల్లించాలి

మాట్లాడుతున్న ఎస్సై జగన్మోహన్

అమరచింత,జనవరి 10, ప్రభాతవార్త: వాహనదారులు పెండింగ్ చాలన్లు ఈ నెల 31 వరకు చెల్లించాలని అమ రచింత మండల ఎస్సై జగన్మోహన్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పెండిం గ్ చాలన్లపై రాయితీ ప్రకటిం చిందని ద్విచక్ర, వాహనాలకు, ఆటోలకు 80 శాతం రాయితీ ఉంటుందని అలాగే ఆర్టీసీ బస్సులకు, 90 శాతం ఇతర వాహ నాలకు 60 శాతం వాహనదారులు చెల్లించాలని ఆయన తెలిపారు. పెండింగ్‌చాలాన్లు వాహనదారులు మీసేవ, ఆన్లైన్, యూపీఐ ద్వారా పెండింగ్ చాలన్లు చెల్లించాలని ఆయన వాహనదారులను కోరారు. పెండింగ్‌లో ఉన్న వాహనదారులుఈ నెల31 వరకు చెల్లించాలని ఆయన తెలిపారు .ప్రతి వాహనదారుడు లైసెన్స్ ,ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని ఆయన వాహనదారులను కోరారు.

జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జిని కలిసిన జిల్లా కలెక్టర్

గద్వాల ప్రతినిధి,జనవరి 10 ప్రభాతవార్త: జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కె.కుషాను మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ బిఎం సంతో ష్ కలిసి పూల బొకే అందించి జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఉదయం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం లో డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కె.కుషాను కలెక్టర్ బిఎం సంతోష్ కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయనకు శుభా కాంక్షలు తెలిపారు. జిల్లాకు నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారి జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జిని మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. అలాగే జిల్లాలోపెండింగ్‌లో ఉన్నకేసుల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్

వీపనగండ్ల,జనవరి 10,ప్రభాతవార్త: వీపనగండ్ల మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ క్రీడలు సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంగినేనిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఆ ట్రస్టు చైర్మన్ మరియు ఆ గ్రామ ఎంపీటీసీ వనపర్తి జిల్లా ఎంపీటీసీల పోరం అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ ఇంద్రకంటే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 12వ తేదీ నుండి 13వ తేదీ వరకు ఈ క్రీడలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ క్రీడలలో గెలుపొందినటువంటి విజేతలకు మొదటి బహుమతి 10016 రూపాయలు రెండవ బహుమతి 5016 రూపాయలు తో పాటు వీరి ఇరువురికి సీల్డ్ మేము ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆసక్తి ఉండేటటువంటి క్రీడాకారులు తమ పేర్లను ఎంట్రీ ఫీజు 500 ఇచ్చి నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. వీటి ఆర్గనైజర్స్ రగణమోని శేఖర్ మోహన్ నాయుడు క్రీడలు నిర్వహించడం జరుగుతుందనిక్రీడల్లో తుది నిర్ణయం అంపైర్ నిర్ణయంగా ఉంటుందని ఆయన తెలిపారు. మండల స్థాయిలో ఉండేటటువంటి క్రీడాకారులు ఈ వాలిబాల్ క్రీడల్లో పాల్గొనాలని ఆయన తెలిపారు.

పిఆర్‌టియు క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

బాలానగర్,జనవరి 10 ప్రభాతవార్త: బాలానగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చేతుల మీదుగా పిఆర్‌టియు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు పిఆర్‌టియు సంఘం నాయకుల విజ్ఞప్తి మేరకు హాజరైన ఎమ్మెల్యే పిఆర్‌టియు క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. ఉపాధ్యాయులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని స్వేచ్ఛాయుతంగా విద్యార్థులకు విద్యాబోధన చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలానగర్ మండల ఇంఛార్జి వెంకటయ్య, పిఆర్‌టియు సంఘం నాయకులు ఉపాధ్యాయ సిబ్బంది, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలను స్కూల్ కాంప్లెక్ తనిఖీ

బిజినేపల్లి, జనవరి10 ప్రభాతవార్త: పాలెం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల కారుకొండ పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనను ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి బోధనా అంశాల ప్రకారం బోధిస్తున్నారా లేదావివరాలు సేకరించారు. పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల హాజరు, రిపోర్ట్స్, రిజిస్టర్, రికార్డులనువిద్యార్థుల హాజరు, రిపోర్ట్స్, రిజిస్టర్, రికార్డులను తనిఖీచేశారు. మధ్యాహ్న భోజనాన్ని ఎలా వడ్డిస్తున్నారు, వంటకాలపై కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు పరిశీలించారు. వెంట సిఆర్పీ మల్లేష్, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు వీరేశ్, చైతన్య, భాగ్యలక్ష్మి, లావణ్య, సంధ్య ఉన్నారు.

పాఠశాలకు వాటర్ ట్యాంక్ బహుకరణ

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 10 ప్రభాతవార్త: గుడిపల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన జీకే పరీక్ష మరియు పాఠశాలకు క్లాస్మెట్ క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్ శిష్యురాలు తూడుకుర్తి ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ జాన్సి రెడ్డి వాటర్ ట్యాంక్ బహుకరణ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుర్మయ్య, క్లాస్మెట్ క్లబ్ డివిజన్ అధ్యక్షులురమణ, కోశాధికారి రవికుమార్, కుమార్, జీహెచ్ఎం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకొని విద్యార్థులు విద్యలో రాణించాలి

కల్వకుర్తి, జనవరి 10 ప్రభాతవార్త: సాంకేతికత విద్యను విద్యార్థులు అందిపుచ్చుకునే విధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కృషి చేస్తారని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామం లోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి 10వ తరగతి విద్యార్థులకు సమకూర్చిన స్కాన్ ఆండ్ లెర్న్ పాఠ్య పుస్తకాలను విద్యార్థినీ, విద్యార్థులకు అందించారు. చదువు ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని, ఆ విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలునాయక్, ఉపాధ్యాయులు రవీందర్, కాంగ్రెస్ నాయకులు అనిల్‌గౌడ్, ఫౌండేషన్ సభ్యులు గొడుగు మల్లయ్య, ఆవ గణేష్, హసన్, తాండ్ర శేఖర్, బొల్గం శివగౌడ్, నాయకులు శ్రీనునాయక్, జిల్లా జర్నలిస్టు సంఘం నాయ కులు యూసుఫ్‌బాబా తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలి

చిన్నంబావి,జనవరి10 ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రభుత్వం ఉద్యోగులకు ఎన్నికల హామీలలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) మండల అధ్యక్షుడు బడికల రామచంద్రయ్య అన్నారు. బుధవారం టిఎస్ యుటిఎఫ్ 2024 క్యాలెండర్‌ను మండల తహసిల్దార్ ఎండి ఇక్బాల్, డిప్యూటి తహసిల్దార్ శ్రీనివాసుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. మండల అధ్యక్షులు బడికల రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రభు

పాఠశాలలో భోగిపళ్ళ కార్యక్రమం

పాఠశాలలో భోగిపళ్ళ వేడుకల దృశ్యం

హుస్నాబాద్, జనవరి10, ప్రభాతవార్త

సంక్రాతి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించుకునే భోగిపళ్ళ కార్యక్రమాన్ని బుదవారం హుస్నాబాద్ కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తుగా పాఠశాల ప్రిన్సిపాల్ బుర్ర రాజేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కెజి, యూకెజీ, 1వ తరగతి విద్యార్థులకు భోగి పళ్ళను తల్లితండ్రుల ఆధ్వర్యంలో అందజేసి మాట్లాడుతూ ఈ రేగుపళ్ళను పిల్లల తల పై పోయడం ద్వార శ్రీమన్నారాయణ ఆశీస్సులు లభించడంతో పాటు వారి చెడు దృష్టి తొలగిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అల్లి శైలేందర్, విద్యార్థుల తల్లితండ్రులు, అధ్యాపక బృధం పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాలకు దేవక్కపల్లి గ్రామ యువకుడు

బెజ్జంకి, జనవరి 10, ప్రభాతవార్త:

యువజనోత్సవాలకు మండల పరిధిలోని దేవక్కపల్లి గ్రామానికి చెందిన సోరుపాక అనిల్‌కుమార్ ఎంపికైనట్లు జిల్లా నెహ్రూ యువ కేంద్రం యువజన అధికారి మూల రంజిత్‌రెడ్డి, కార్యక్రమ అధికారి కిరణ్‌కుమార్‌లు బుధవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ యువజన క్రీడల మంత్రిత్వశాఖ అధ్వర్యంలో మహా రాష్ట్రం లోని నాసిక్‌లో ఈనెల 12 నుంచి 16 వరకు జరగనున్న 27వ జాతీయ యువజనోత్సవాలు జరుగున్నాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, వివిధ కళా రూపాల సాంస్కృతిక ప్రదర్శనతో పాటు జాతీయ సమైక్యత, సామాజిక అంశాలపై యువ చర్చాగోష్టి, యూత్ మీట్‌లో ప్రదర్శించనున్నారని తెలిపారు. ఈ ఉత్సవాలు దేశ ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానితో పాటు పలువురు కేంద్ర మంత్రులు పాల్గొంటారని వారు వివరించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, క్రీడా సామాగ్రి వితరణ

బెజ్జంకి, జనవరి 10, ప్రభాతవార్త:

మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సర్పంచ్ బోయినిపల్లి నర్సింగరావు బుధవారం సందర్శించి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, క్రీడా సామాగ్రిని పంపిణీ చేసి మాట్లాడారు. పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పాఠశాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టిపిసిసి వ్యవహారాల ఇంచార్జికి సన్మానం

దీపాదాస్ మున్షిని సన్మానిస్తున్న టిపిసిసి చేనేత విభాగం చైర్మన్ గూడూరి శ్రీనివాస్

సిద్దిపేట రూరల్, జనవరి 10, ప్రభాతవార్త:

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి, ఏఐసీసీ నాయకురాలు దీపాదాస్ మున్షిని హైదారాబాద్‌లోని గాంధీభవన్‌లో బుధవారం టిపిసిసి చేనేత విభాగం చైర్మన్, సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గూడూరి శ్రీనివాస్(ఎస్టీడి) మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షిని శాలువతో ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అరు గ్యారెంటీల సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి నిరుపేదకు అందేలా చూడాలని ఆమె సూచించినట్లు గూడూరి శ్రీనివాస్ తెలిపారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పని చేయాలని కోరినట్లు అయన తెలిపారు.

నేత్రదానంతో అంధులకు చూపును ప్రసాదించిన వారమవుతాం

-వాసవీక్లబ్ నాయకులు గంప శ్రీనివాస్

సిద్దిపేట రూరల్, జనవరి 10, ప్రభాతవార్త :

సిద్దిపేట వాసవీక్లబ్ అధ్వర్యంలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ నాయకులు కొర్తివాడ రాజేందర్ తండ్రి విశ్రాంత ఉపాధ్యాయులు కొర్తివాడ శేఖరం మరణించగా కుటుంబ సభ్యుల అనుమతితో నేత్రాలను బుధవారం సేకరించినట్లు వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అడ్డినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సేకరించిన నేత్రలను ఎల్‌వి ప్రసాద్ ఐ బ్యాంక్‌కు పంపించినట్లు తెలిపారు. నేత్రదానం చేయడం వలన ఇద్దరి అంధులకు చూపును ప్రసాదించిన వారమవుతామని తెలిపారు. ఎవరైనా దురదృష్టావశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి నేత్రదానం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నేతద్రానం చేసిన కుటుంబీకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ నాయకులు కృష్ణమూర్తి, నేతి వేణుకుమార్, మంకాల శ్రీనివాస్, చింత రాజేంద్ర ప్రసాద్, చకలం రవి, అర్వపల్లి హరికిరణ్, లింగ శ్రీనివాస్, జైన సత్యం, శశాంక్, శివ్వ శ్రీనివాస్, సోమ శివకుమార్, సోమ వనజ, అయిత పురుషోత్తం, మర్యాల వీరేశం, చందా వేణుగోపాల్, బచ్చు రమేష్, అలయన్స్ క్లబ్ నాయకులు బెజగం అత్మరాములు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం ఏకపక్ష వైఖరిని విడనాడాలి

-ఎల్ఐసి ఉద్యోగుల నిరసన

జహీరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న ఏకపక్ష వైఖరికి నిరసనగా పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం ముందు సంస్థ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం ఎల్ఐసి ఉద్యోగులు విధులను బహిష్కరించిన ఒక గంట పాటు సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిఈయు సంఘం కార్యదర్శి అశోక్, ఉద్యోగులు బి మాణయ్య, చంటి, బి నర్సింలు, శ్రీనివాస్, వెంకట్‌రామన్, రామకృష్ణ, మధు, మోహన్ కృష్ణ, అలీం తదతరులు పాల్గొన్నారు.

ఎల్ఐసి కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించొద్దు

-జీవో నెంబర్ 55ను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి

-ఏబీవీపీ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌గౌడ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌గౌడ్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి10 ప్రభాతవార్త:

అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించొద్దని, జీవో నెంబర్ 55ను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మెదక్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మెదక్ పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ వ్యవసాయ ఉద్యాన యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కాటాయించవద్దని ఈ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ అంటేనే తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి వ్యవసాయ రంగానికి మేలు చేకూర్చి దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా మార్చేలా రైతులకు నష్టాలు జరగకుండా రైతులు పండించే ప్రతి పంటకు లాభం వచ్చే విధంగా నూతన వంగడాలను విత్తనాలపై పరిశోధనలు, అభివృద్ధి కోసం ఏర్పాటు చేయబడిందన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీలో 35 సంవత్సరాలుగా మెడిసన్ ప్లాంట్లు, వెజిటేబుల్ సీడ్స్ మొదలుగా వాటిపై ఎన్నో రకాల పరిశోధనలు జరిగి తెలంగాణ రాష్ట్రంలో రైతులు, రైతాంగాలను పటిష్టం చేయడానికి కృషి చేయడం జరుగుతుందని, కానీ నేడు ఆ ఆగ్రో బయోడైవర్సిటీలో దాదాపు 100 ఎకరాల భూమిని తీసుకోవడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందని. కానీ హైకోర్టు బల్డింగ్‌ను ఈ ప్రాంగణంలో కట్టవద్దని ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీలో హైకోర్టు భవనాలను కట్టడం అంటే తెలంగాణ రాష్ట్రంలోని వ్యవసాయ రంగాన్ని తుంగలో తొక్కి వ్యవసాయ అభివృద్ధికి అడ్డుకట్ట వేయడమే అని, అదేవిధంగా గ్రామీణ విద్యార్థులకు విద్యను దూరం చేసి పరిశోధనలు జరగకుండా ప్రభుత్వం కుట్ర పూనుతుందని ఏబీవీపీ తెలియజేస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి యూనివర్సిటీ భూములపై హైకోర్టుకు కేటాయించిన నిర్ణయం వెనక్కు తీసుకోవాలని, జీవో నెంబర్ 55ని వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ హెచ్చరిస్తుందన్నారు. మీకు అంత చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేట లాంటి ప్రదేశాల్లో వేల ఎకరాలు కబ్జాలు చేసిందని, మీకు దమ్ముంటే హైకోర్టు భవనం అక్కడ కట్టి చూపించాలని, యూనిర్సిటీ జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. మీరు ఎన్ని ప్రయత్నాలు చేసిన యూనివర్సిటీ గుంట భూమి కూడా వదులుకోవడానికి సిద్ధంగా లేమని ఏబీవీపీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తుందని, ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని కట్టడాన్ని ఆపాలని, లేనిపక్షంలో ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని కార్యాచరణ రూపొందించి ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్, నాయకులు విజ్ఞాన్, కార్తికేయ, సత్య, వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

జలహనుమాన్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

-కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి

జలహనుమాన్ ఆలయంలో జలాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆంజనేయులుగౌడ్, ఆవుల రాజిరెడి, కాంగ్రెస్ నాయకులు తదితరులు

నర్సాపూర్, జనవరి 10.ప్రభాతవార్త:

మండల పరిధిలోని పెద్దచింతకుంట గ్రామ శివారలో వెలిసిన శ్రీ జలహనుమాన్ ఆలయ అభివృద్ధి తమ వంతు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ ల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి లు అన్నారు. బుదవారం జలహనుమాన్ ఆలయంలో యువజన కాంగ్రెస్ నాయకులు విజయ్ కుటంభ సభ్యులతో సత్యనారాయణ వ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సత్యనారాయణ వ్రతం కు ఆహ్వానించడంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి లు ఆవులరాజిరెడ్డి లు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు జలాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసి 51 కొబ్బరికాయలు కొట్టడం జరిగింది. ఈ మేరకు వారు ఆలయ ప్రాంగణం లో కలియ తిరిగి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూఆలయ ప్రాంగణంలో ఉన్న పాడుబడ్డ బావిని పూడ్చి వేయిస్తామని వారు హామీ ఇవ్వడం జరిగింది. అంతేగాక ఈ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయం చేస్తామని వారు తెలిపారు. ఈకార్యక్రమంలోఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్, మాజీ జడ్‌పిటీసి శ్రీనివాస్‌గుప్త, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేషం, శివ్వంపేట అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు చార్ల సందీప్, నర్సాపూర్ మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ ఉదయ్‌కుమార్, నర్సాపూర్ మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్, యుత్ కాంగ్రెస్ నాయకులు మణిదీప్, రాజుయాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు శివప్రసాద్‌గౌడ్, ఓబిసి సెల్ మండల ఉపాధ్యక్షులు చందాగౌని మహేశ్‌గౌడ్, మోహన్‌దాస్‌గౌడ్, నాయకులు బాలరాజు, రాములుయాదవ్, బిక్షపతిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గాజులు పెట్టుకోవాలనే మూఢ నమ్మకం జోరుగా ప్రచారం

కొండపాక, జనవరి 10, ప్రభాతవార్త

సంక్రాంతి పండుగ ఒక కీడులా వచ్చిందని దానికి ఇద్దరు కొడుకులున్న వారు ఒక్క కొడుకు ఉన్న వారికి గాజులు పెట్టించాలని ఒక మూడ నమ్మకం గత వారం రోజుల నుండి జోరుగా ప్రచారం జరుగుతుంది. మహిళలు గాజులు పెట్టుకొవడానికి ఇద్దరు కొడుకులున్న వారిని నాలుగురు ఐదుగురి నుండి కొన్ని డబ్బులు తీసుకొని ఐదు లేదా మూడు రకాల గాజులు పెట్టించుకొవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సాయి పంతులును వివరణ కోరగా మహిళలు గాజులు పెట్టించుకొక పోతే ఎదో కీడు జరుగుతుందనే మాట వాస్తవం కాదని సంక్రాంతి పండుగలో ఎలాంటి దోషం లేదని తెలిపారు. భారత దేశంలోని 29 రాష్ట్రాల్లో ఎక్కడలేని విధంగా ఒక్క మన తెలంగాణ ప్రాంతంలో మాత్రమే ఇలాంటి దుష్పచారం జరుగుతుందని దానిని ఎవరు నమ్మవదన్ని కోరారు. శాస్త్రంలో, పంచాంగంలో ఎక్కడ కూడా గాజులు పెట్టుకొకపోతే కీడు జరుగుతుందని లేదన్నారు. సుహాసినిలకు ఒకవేళ గాజులు పెట్టించాలనుకుంటే ముత్తయిదువులను పిలిచి వాయనం లాగా ఇచ్చి మీ ఇంట్లో గాజులు పెట్టించాలని సూచించారు. శాస్త్రంలో ఉంటే ఎక్కడికక్కడ పండితులు, పురోహితులు, ప్రజలకు తెలియజేస్తారన్నారు. ఇలాంటి వదంతులను నమ్మి సమయం, డబ్బులను వృధా చేసుకొవద్దని ఆయన కోరారు. డిగ్రీలు, పీజిలు చదువుకున్న వారు సైతం ఇలాంటి మూడ నమ్మకాన్ని నమ్మడం విడ్డురంగా ఉందన్నారు. దీనిని ఎక్కువగా ప్రచారం చేస్తుంది చదువుకున్న మహిళలే కావడం విడ్డురంగా ఉందన్నారు. అంతే కాకుండా సంక్రాంతికి కొత్త అల్లుడిని పిలిపించుకొని పాలతో కాళ్లు కడగాలని కూడా ప్రచారం జరుగుతుందని వీటిని ప్రజలేవ్వరు నమ్మవద్దని అది అంత తప్పుడు ప్రచారం అన్నారు.

ఘనంగా ముగిసిన శ్రీ మల్లన్నజాతర ఉత్సవాలు

.నారాయణపూర్‌లోని శ్రీ మల్లన్న జాతరలో పాల్గొన్న ఒగ్గు కళాకారులు

నర్సాపూర్ రూరల్, జనవరి 10.ప్రభాతవార్త:

నర్సాపూర్ మండల పరిదిలోని నారాయణపూర్ గ్రామంలో గత మూడు రోజులుగా శ్రీమల్లన్న జాతర ఉత్సవాలను ఆ గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న జాతర ఉత్సవాలకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, కాంగ్రెస్ టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి లు వేరువేరుగా సందర్శించి శ్రీ మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. జాతర ఉత్సవాల్లో బాగంగా మూడు రోజులుగా గంగపటం, బోనాలు, దేవుని కళ్యాణం, బండ్లు తిరుగుట, బండిశిడి వంటి కార్యక్రమాలు జరుగగా బుదవారం పాచిబండ్ల ఊరేగింపుతో జాతర ఉత్సవాలు ముగిశాయి. ఈ మేరకు గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో, నియమ నిష్టలతో మల్లన్న జాతరను ఘనంగా జరుపకున్నారు. ఈ జాతరలో రాత్రి సమయాల్లో ఒగ్గుకథలు. వీధీ బాగవతాలు వంటి విప్రదర్శించడం జరిగింది. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహ్మద్ ఇస్రత్ ఫాతీమా అబుబాయ్, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలను ధ్వంసం చేసిన ఎక్సైజ్ పోలీసులు

గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

కోహేడ, జనవరి 10, ప్రభాతవార్త :

మండల పరిధిలోని చంద్రనాయక్ తండాలోని ఓ ఇంటి పెరట్లో అక్రమంగా పెంచుతున్న 26 నిషేధిత గంజాయి మొక్కలను గుర్తించి సిద్దిపేట ఎక్సైజ్ పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. ఈ మేరకు ఇంటి యజమానిపై కేసు నమోదు చేయగా పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

యువతలో కొత్త ఉత్సాహం నింపేలా కైట్ ఫెస్టివల్

కైట్ ఫెస్టివల్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సంపత్‌రెడ్డి తదితరులు

సిద్దిపేట రూరల్, జనవరి 10, ప్రభాతవార్త :

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోమటిచెరువు వేదికగా యువతలో కొత్త ఉత్సాహం నింపేలా..సిద్దిపేట బిఆర్ఎస్ పార్టీ యువత, విద్యార్థి విభాగం అధ్వర్యంలో ఈనెల 13న ఉదయం 10 గంటలకు కైట్ ఫెస్టివల్ నిర్వహించడం జరుగుతుందని పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాల సాయిరాంలు తెలిపారు. బుధవారం కోమటిచెరువుపై కైట్ ఫెస్టివల్ కార్యక్రమ ఏర్పాట్లను వారు పరిశీలించి మాట్లాడారు. సిద్దిపేట అహ్లాదాన్ని అందించే కోమటి చెరువు నెక్లస్ రోడ్డు వేదికగా అద్భుతంగా కైట్ ఫెస్టివల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పాల్గొంటారని తెలిపారు. సిద్దిపేట యువత పెద్దయెత్తున పాల్గొని కైట్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కర్త రమేష్, రాంచందర్‌రావు, యువత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు పథకాన్ని యథావిధిగా కొనసాగించాలి

కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న డిడబ్ల్యుజెఎస్ నాయకులు

సిద్దిపేట రూరల్, జనవరి 10, ప్రభాతవార్త :

దళితుల అర్థికాభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని యదావిధిగా కొనసాగించాలని దళిత్ వర్కింగ్ జర్నలిస్టు వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు జంగం రాజలింగం, ప్రధాన కార్యదర్శి మంద జనార్ధన్‌లు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సొసైటీ అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం దళితుల అర్థిక ఎదుగుదల కోసం దళిత బంధు ప్రవేశపెట్టిందన్నారు. దళిత జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దళితబంధు పథకాన్ని అమలు చేస్తారని అశిస్తున్నట్లు తెలిపారు. రెండో విడతలో అర్హులైన వారికి వెంటనే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దళిత బంధు పథకాన్ని కొనసాగిస్తూ దళిత జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లాభపేక్ష లేకుండా దళిత జర్నలిస్టులు నిరంతరంగా ప్రజాసేవకు అంకితమై పని చేస్తున్నారని తెలిపారు. దళితబంధు పథకాన్ని కొనసాగించి దళిత కుటుంబాలను అదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డిడబ్ల్యుజెఎస్ ప్రతినిధులు చంద్రం, రంగరాజు, రాజు, ప్రభుదాస్, బాపురావు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర్‌ను కలిసిన జహంగీర్ హుస్సేన్

మంత్రి దామోదర రాజనర్సింహను సన్మానిస్తున్న జహంగీర్ హుస్సేన్

శివ్వంపేట, జనవరి10 ప్రభాతవార్త:

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జహంగీర్ హుస్సేన్ బుధవారం మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న తాజా పరిస్థితులపై ఇద్దరి మధ్య చర్చించుకోవడం జరిగింది. కాంగ్రెస్ పార్టీలో అనేక సంవత్సరాలుగా క్రియాశీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నాయకులు జహంగీర్ హుస్సేన్‌ను మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. ముందు ఊహించిన విధంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం జరిగిందని జహంగీర్ హుస్సేన్ అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక సీట్లు సాధించడం ఖాయమని వారు అన్నారు. అనంతరం జహంగీర్ హుస్సేన్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని కలిసి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపడం జరిగింది. మంత్రిని కలిసిన వారిలో సద్దాం హుస్సేన్, అన్వర్ హుస్సేన్, రౌషన్, అంజత్ ఖాన్ తదితరులు ఉన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన నర్సారెడ్డి

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తూంకుంట నర్సా రెడ్డి

గజ్వేల్ టౌన్, జనవరి 10 (ప్రభాతవార్త):

కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, గజ్వేల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నేత నాగరాజు, నాయకుడు మహ్మద్ ఫారూక్ జానీ, మన్నె కృపానందంల ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నాయిని యాదగిరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మహ్మద్ ఇక్బాల్, నాయకులు గోపాల్‌రావు, ప్రేమ్‌కుమార్, మహంకాళి చంద్రం, సంగుపల్లి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆర్థిక స్వావలంబనే రోటరీ క్లబ్ ధ్యేయం

మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న బాబుగౌడ్

ములుగు, జనవరి 10 (ప్రభాతవార్త):

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా రోటరీ ఇంటర్నేషనల్ పనిచేస్తుందని రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్ అన్నారు. బుధవారం ములుగు మండలంలోని తునికిబొల్లారంలో హెల్ప్ టు నీడి సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంను ప్రారంభించడంతో పాటు మహిళలకు మూడు కుట్టు మిషన్‌లు అందించారు. ఈ సందర్భంగా బాబుగౌడ్ మాట్లాడుతూ స్వయం ఉపాధి వైపు మహిళలను మళ్ళించేందుకు పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి మహిళ ఆర్థిక అభివృద్ధి సాధించినప్పుడే వారి కుటుంబం ప్రగతి సాధిస్తుందన్నారు. అనంతరం హెల్ప్ టు నీడి సంస్థ వ్యవస్థాపకులు సీఎస్ మహేష్‌రావు పంతులు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మహిళలకు మరిన్ని కుట్టు మిషన్‌లు ఇప్పించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెంబర్ అట్రాక్షన్ చైర్మన్ కొడాలి చంటి, వాటర్ మరియు శానిటేషన్ చైర్మన్ కుంట కరుణాకర్‌రెడ్డి, పూర్వ అధ్యక్షుడు జగదీశ్వర్, బాపురెడ్డి, సభ్యులు చిట్టిరెడ్డి, అశోక్, వెంకటేష్‌గౌడ్, అశోక్‌రెడ్డి, గ్రామ పెద్దలు మోహన్‌రెడ్డి, స్వరూపరెడ్డితో పాటు మహిళలు పాల్గొన్నారు.

వాహనాలను ఢీకొన్న ఇన్నోవా కారు

-మహిళకు తీవ్ర గాయాలు

రామచంద్రాపురం, జనవరి 10, ప్రభాతవార్త: అజాగ్రత్తగా కారును తోలుతూ పలు వాహనాలను ఢీకొన్న సంఘటలో ఓ మహిళకు తీవ్ర గాయాలు (కాలు వరిగింది) కాగా మరికొందరు స్వల్ప గాయాలకు గురైన సంఘటన బుధవారం మధ్యాహ్నం రామచంద్రాపురం పోలీసు ఠాణా పరిధిలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. రామచంద్రాపురం పోలీసుల కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో సు